# ఖా ఖీలా లీ!

-యం. చైతన్యకుమార్

ఉదయం పదకొండు గంటలవేళ పోలీస్‌స్టేషన్‌లో ''...కొడకా! చెప్పు ఆ విగ్రహం ఏడ దాచిపెట్టినావ్'' ప్రశ్నలతో ఎస్సై అంజిరెడ్డి బెల్టు దెబ్బలు రెండు నారిగాడి ఒంటిమీద ప్రత్యక్షమైనాయి.

''మీ కాల్మొక్కుత. నిజంగానే నాకేం తెల్వదు సార్'' కళ్లలో నీళ్లూరుతుంటే చెప్పాడు నారిగాడు.

''ఇట్లినవురా నువ్వు. బొక్కలిరగ్గొడితేనే ఇంటవు'' అంటూ జుట్టు పట్టుకుని పైకి లేపాడు అంజిరెడ్డి. అప్పుడే సెల్‌లోకి అడుగుపెట్టాడు కానిస్టేబుల్ టూ నాట్ ఎయిట్. ఎస్సై దగ్గరకెళ్లి ''సార్! మీకు ఫోన్'' అని చెప్పాడు.

''నేను లేనని చెప్పు''

''కానీ అవతల డిఎస్పీ సాబ్ సార్''

విసుగుతో ముఖానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ వెళ్లి రిసీవర్ ఎత్తాడు.

''హలో! నమస్తే సార్. నేను అంజిరెడ్డిని''

''అట్లానా సార్''

''సరే సార్''

''ఎప్పటికి సార్''

''మంచిది సార్''

''సరే సార్. ఉంటా సార్'' రిసీవర్ క్రెడిల్‌చేసి వెళ్లి కుర్చీలో కూర్చున్నాక టేబుల్ మీద చేతులానించి ''ఎవరయ్యా జవాను'' అంటూ పిలిచాడు హెడ్డు నర్సింహ ఎస్సై ముందుకొచ్చి నిలబడ్డాడు.

''ఆ ఇస్మాయిల్‌ను పిలు. అట్లనే రెండు చాయ్‌లు చెప్పు. నారిగాడి బామ్మర్దికి సమన్లియ్యమని రైటర్‌కు చెప్పు'' చెప్పాడు అంజిరెడ్డి.

''సరే సార్'' అంటూ స్టిఫ్‌గా సెల్యూట్ ఒకసారి కొట్టి ఆ గదిలోంచి బయటపడ్డాడు హెడ్డు.

హెడ్డు వెళ్లిన నాలుగు నిముషాలకు ఎస్సై గదిలోకి అడుగుపెట్టాడు ఇస్మాయిల్. ఆ స్టేషన్ అసిస్టెంట్ ఎస్సై ''రా కూర్చో'' కుర్చీ చూపించాడు అంజిరెడ్డి. ఫ్లాస్క్‌లో టీ తీసుకువచ్చి రెండు కప్పుల్లో పోసి టేబుల్ ముందుంచాడు టూ నాట్ ఎయిట్.

''చాయ్ తీస్కో'' తనో కప్పు తీసుకుంటూ చెప్పాడు అంజిరెడ్డి.

టీ తాగుతూ అంజిరెడ్డి ఇస్మాయిల్‌తో ''దొరవారు ఫోన్ చేసిండు'' అన్నాడు.

''ఎందుకు సార్'' అడిగాడు ఇస్మాయిల్.

టేబుల్ మీదున్న గ్లోబ్ తిప్పుతూ చెప్పాడు అంజిరెడ్డి ''ఆయన బిడ్డ అల్లుడు ఇక్కడ్నుంచి బెంగ్లూర్ పోతున్నారంట. మనలను టికెట్లు బుక్ చెయ్యమని చెప్పిండు''

''అయితే ఏమైంది సార్. ప్రైవేట్ ట్రావెల్స్‌ల ఎండ్లనన్న బుక్ చేద్దాం''

''కానీ వాళ్లకు ప్లేన్ల పోవాలని ఉన్నదంట. ప్లేన్ టికెట్లు బుక్ చెయ్యమన్నడు'' సిగరెట్ తీసి వెలిగించుకుంటూ చెప్పాడు అంజిరెడ్డి.

''ప్లేన్ల బుక్ చేయాల్నా సార్. ఎంత లేదన్నా అయిదు వేలయితది గద సార్'' మెల్లగా అంచనా వేశాడు ఇస్మాయిల్.

''నేటూ! మొన్న నాల్గురోజుల కింద బస్టాండ్‌ల నిలబడ్డ మండల్ ప్రసిడెంట్ పెండ్లాం మెడల నుంచి మూడుతులాల గొలుసును ఒకడు కొట్టేసిండు. అది నీకమ్మిండని ఇన్ఫర్మేషన్ తెల్సింది. ఏం జెయ్యాలే అవెంత లేదన్నా పంద్రా హజార్ గొలుసు. నీకెంత కమ్మిండో చెప్పు''

''అందుకే ఎట్ల చేద్దామంటవు'' సిగరెట్ పొగ వదుల్తూ అడిగాడు అంజిరెడ్డి.

''ఐనా మన దగ్గర పైసలుంటాయని ఆయనెట్లనుకుండు సార్'' మెల్లగా సందేహం బయటపెట్టాడు ఇస్మాయిల్.

''వారంరోజుల కింద మర్డర్ కేసుల మనం దొబ్బిన పదిహేనువేల సంగతి ఎవడో ఉప్పిచ్చి నట్లుండు. మననలను పట్టుకుండు. ఆ డబ్బిచ్చినోడి సంగతి తర్వాత చూసుకుందాంగానీ ముందు ఇదెట్ల దాటదాం అది జెప్పు'' సిగరెట్టు కింద వేసి కాలుకింద నలుపుతూ అడిగాడు అంజిరెడ్డి.

ఇస్మాయిల్ టోపీ తీసి టేబుల్‌మీద పెట్టి తల తడుముకున్నాడు. తర్వాత పైన ఫ్యాన్ వంక చూశాడు. తర్వాత మెల్లగా కుర్చీలో కొంచెం ముందుకు జరిగి మెల్లగా ''ఒక పని చేద్దాం సార్'' అంటూ ఏం చేయాలో వివరించాడు.

అంజిరెడ్డి చిన్నగా నవ్వి టేబుల్ మీద వున్న బెల్ నొక్కాడు. హెడ్డు నర్సింహ లోపలకడుగుపెట్టగానే చెప్పాడు.

''నర్సింహా! ఆ వెంకట్రమణగాడ్ని పట్టుకురా తొందరగా''

★★★

సాయంత్రం ఐదుగంటలవేళ తమ దుకాణం ముందు పోలీస్‌జీపు ఆగగానే ఆశ్చర్యపోయాడు శ్యామ్‌లాల్.

జీపులో నుంచి దిగి దుకాణంలోకొస్తున్న అంజిరెడ్డి, ఇస్మాయిల్‌లను ఆహ్వానించాడు.

''ఆయియే సాబ్ ఆయియే. బైటియే'' అంటూ కుర్చీలు చూపించాడు.

వాళ్లు కూర్చున్నాక అడిగాడు ''ఏం తీసుకుంటారు సార్?''

''ఏమొద్దు'' మధ్యలోనే వారించాడు అంజిరెడ్డి. మెల్లగా సిగరెట్ తీసి వెలిగించి అడిగాడు.

''నేటూ! మొన్న నాల్గురోజుల కింద బస్టాండ్‌ల నిలబడ్డ మండల్ ప్రసిడెంట్ పెండ్లాం మెడల నుంచి మూడుతులాల గొలుసును ఒకడు కొట్టేసిండు. అది నీకమ్మిండని ఇన్ఫర్మేషన్ తెల్సింది. ఏం జెయ్యాలే అవెంత లేదన్నా పంద్రా హజార్ గొలుసు. నీకెంత కమ్మిండో చెప్పు''

శ్యామ్‌లాల్ గుండె గుభిల్లుమంది. ఐనా తనకెవ్వరూ అలాంటి గొలుసమ్మలేదు. మెల్లగా గొంతు పెగుల్చుకుని చెప్పాడు. ''సాబ్! నాకెవ్వడూ గా గొలుసమ్మలేదు'' అంజిరెడ్డి జీపు వంక చూస్తూ చెప్పాడు.

''ఏయ్ నర్సింహా! ఆ వెంట్రమణగాడ్ని పట్కరా ఇక్కడ''

మరుక్షణం జీపులో నుండి హెడ్డు నర్సింహ మరో కానిస్టేబుల్ కలసి వెంకట్రమణ్ణి తీసుకువచ్చి అంజిరెడ్డి పక్కన నిలబెట్టారు. అంజిరెడ్డి కుర్చీలో నుండి లేచి వెంకట్రామడి కాలర్ పట్టుకుని చెంపమీద కొట్టి అడి




గాడు ''ఎదవా! ఎవడికమ్మినావ్ ఆ గొలుసు?'''

''ఈ సేటోకే అమ్మినా సార్'' చెంప తడుముకుంటూ శ్యామ్‌లాల్‌ను చూపిస్తూ చెప్పాడు.

శ్యామ్‌లాల్‌కి అర్థమైంది. తానిందులో ఇరుక్కున్నానని. వెంకట్రాముడిమీద విపరీతమైన కోపం వచ్చింది. చేతులు పైకి ముడుస్తూ అడిగాడు ''ఎప్పుడమ్మినావురా నాకు నువ్వు గొలుసు''

''మొన్న రాత్రి వానపడ్డరోజు''

వెంకట్రాముడు అంజిరెడ్డి పక్కకు జరుగుతూ చెప్పాడు.

''తేరే...'' ముందుకు దూకబోయాడు శ్యామ్‌లాల్. ఇస్మాయిల్ పట్టుకుని ఆపాడు. అంజిరెడ్డి కోపంగా వెంకట్రాముడ్ని

''ఏయ్ నడురా'' అంటూ తోపు తోశాడు. తర్వాత ఇస్మాయిల్‌వంక తిరిగి ''ఇస్మాయిల్! సేట్‌ను స్టేషన్‌కు తీసుకురా. స్టేషన్‌లో మాట్లాడుకుందాం. మర్యాదగా గొలుసు ఇస్తడా ఇయ్యడా'' అంటూ జీపులో కూర్చున్నాడు. ఇస్మాయిల్ సేటువంక తిరిగి మెల్లగా సముదాయిస్తున్నట్లుగా చెప్పాడు ''ఎందుకు సేటూ పోలీసోళ్లతోని పెట్టుకుంటావు. ఆ స్టేషన్ కోర్టుకు ఏం తిరుగుతవ్. ఆ గొలుసు ఇక్కడ పడెయ్యరాదు''

''నేను ఎవ్వణి దగ్గర ఎట్లాంటి గొలుసు కొనలేదు సార్. ఆడెవడో'' శ్యామ్‌లాల్ ఇంకా ఏదో చెప్పబోయేంతలో-

''ఇప్పుడు నువ్వు చెప్పినా ఎవరూ నమ్మరు. ఆ కోర్టు కేసు ఎట్లా తప్పదు'' అంటూ మధ్యలోనే సమాధానమిచ్చాడు ఇస్మాయిల్.

''ఈ తిప్పలన్నీ ఎక్కడ పడతవుగానీ ఒక పదివేలు ఇస్తివంటె ఏ కేసుండదు. ఏముండదు. ఏదో ఒక గొలుసు కొని పారేసైపో పోతది'' సలహా ఇచ్చాడు ఇస్మాయిల్.

''పదివేలా?'' శ్యామ్‌లాల్ నోరెళ్లబెట్టాడు. ముందున్న గల్లా తెరిచాడు. ఆ తర్వాత పక్కకెళ్లి బీరువా తెరిచాడు. చేతిలో నోట్లు ఒకసారి లెక్కబెట్టి చెప్పాడు.

''మొత్తం ఏడువేలకంటే ఎక్కువలేవు సాబ్'' కళ్లనీళ్లతో ఇస్మాయిల్ చేతిలో పెట్టాడవి. మనసులో ఒక వంక బాధ, ఉక్రోషం. ఐనా ఏమీ చేయలేని నిస్సహాయత. ఇస్మాయిల్ నోట్లవంక ఒకసారి చూసుకుని ''ఇగ నువ్వేం ఫికర్ చెయ్యకు. ఆ కేసు బుక్ కాకుండా చూస్త. వొస్తా'' అంటూ వెళ్లి జీపులో ఎస్సై ప్రక్కన కూర్చున్నాడు. జీపు మెల్లగా అక్కడ్నుంచి కదిలింది. అంజిరెడ్డి హుషారుగా అడిగాడు ''ఎంతిచ్చిండు''

''ఏడువేలిచ్చిండు సార్ ఎక్వ లేవంట'' చెప్పాడు ఇస్మాయిల్.

జీపు కొద్దిదూరం వెళ్లాక జీపు ఆపించాడు అంజిరెడ్డి. జీపులో వెనక్కి చూస్తూ ''అరేయ్ వెంకట్రమణ ఇక్కడ రారా'' పిలిచాడు. వాడు వెనుక నుంచి జీపు దిగి ముందుకొచ్చి నిలబడ్డాడు. అంజిరెడ్డి వాడి చేతిలో రెండు వంద రూపాయల నోట్లుంచాడు. ''ఇగపో బిడ్డా! ఈ సంగతి ఎణ్ణన్న తెల్వాలె లోపలేసి చమ్డీలు తీస్త'' హెచ్చరించాక డ్రైవర్‌తో చెప్పాడు ''చక్కగా ఏర్‌పోర్టుకు పోనీ. టిక్కెట్లు బుక్ చెయ్యాల''

★